గత సంచిక తరువాయి

# బార్ మెయిడ్

-ఆడెల్ల శివకుమార్



బొంబాయిలో అన్నిటికన్నా సులభమైన పని ఆడ శరీరాన్ని సాధించటం పొట్ట గడుపుకోవడానికి అది సహజమైన, సులువైన మార్గం. శరీర వ్యాపారం.

బొంబాయిలోని బీర్ బార్‌లను పరిశీలిస్తే మనకు స్పష్టంగా అర్థమయ్యే అంశం యిది. ఢిల్లీలో కూడా ఇలాంటి బార్‌లు వున్నాయి. కానీ వాటి సంఖ్య చాలా తక్కువ.

అయినా అక్కడ అమ్మాయిలు సర్వ్ చేయరు. ఢిల్లీలో కేబరే హౌస్‌లున్నాయి. అక్కడ మగవాళ్ళ వాంఛల్ని, మోహావేశాల్ని సంతృప్తి పరచేందుకు యజమానులు డాన్సర్లతో అర్థనగ్నంగానూ, పూర్తి నగ్నంగానూ అథమస్థాయి నృత్యాలు చేయిస్తుంటారు.

ఈ విధంగా చూస్తే బొంబాయి బార్‌లలో ఏర్పాటయ్యే నృత్యాలు దీనికి పూర్తి భిన్నంగా వుంటాయి. ఇక్కడ అన్నీ ఒక పథకం ప్రకారం పద్ధతిగా జరిగి పోతుంటాయి.

పురాతన కాలంలో రాజులు, మహారాజులు లేదా పాదుషాలు దర్బారుల్లో సాఖీలు వుండేవారు. వాళ్ళు తమ స్వహస్తలతో మధువును కలిపి పురుషుల కౌగిట్లోకి వెళ్ళి పెదవులకు మధువు నందించేవాళ్ళు. ఇవాళ రాజులూ, మహారాజులూ లేరు. పాదుషాలు అంతకన్నా లేరు. అయితే బొంబాయి మహానగరంలో మాత్రం ఈ నాటికీ రాజులకి కొదవలేదు. సాఖీలకీ కొరతలేదు. బొంబాయిలో ప్రతిఒక్కడూ ఒక రాజాయే. జేబులో డబ్బుంటే చాలు. వాడి జేబులో వున్న డబ్బే రాజు. బొంబాయిలోని ఎక్కువ శాతం బార్‌లలో వేలాదిమంది ఆధునిక యుగపు సాఖీలు ఉన్నారు. వీళ్ళు మధువును తాగించే నెపంతో తమవును సయితం అర్పించటానికి సంసిద్ధంగా వుంటారు.

నేను ఒక చోట చదివాను. మన దేశానికి చెందిన విలాసపురుషులైన కొందరు రాజులు, నవాబులు తమ విలాస భవనాల్లో మెట్టుకొక మహిళను నగ్నంగా నిలబెట్టే వాళ్ళట. మెట్లు ఎక్కి పైకి వెళ్ళేటప్పదు ఆధారం కోసం నగ్నంగా నిలబడివున్న అమ్మాయిల రొమ్ముల్ని పట్టుకునే వాళ్ళట. మరి ఇది విలాసమో, మానసిక వైకల్యమో వారికే తెలియాలి. ఆడదాని శరీరాన్ని గురించి మగవాడి మస్తిష్కంలో రకరకాల వాంఛలు నిండిపోయి వుంటాయి. మగవాడిలో గుప్తంగా వుండే ఈ వాంఛల్ని

బొంబాయి బార్ యజమానులు ఆడ దాన్ని మాధ్యమంగా పెట్టి సొమ్ము చేసుకుంటారు. బొంబాయిలో ఒక బార్ వుంది. ప్రస్తుతం అది మూతబడివుంది. అందులోకి వెళ్ళి ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం మాకు దొరకలేదు. ఆ బార్‌లోకి అడుగుపెట్టాలంటే ఒక్కొక్కడికి ఎంట్రీ ఫీజు 350 రూపాయలు. లోపలి ఖర్చు ఆపైన అదనం. అక్కడ ప్రతి టేబుల్ దగ్గర యూరోపియన్ స్టయిల్లో 'బన్నీ గర్ల్' వుంటుంది.

యూరప్‌లో ఇది సర్వసాధారణం. అనేక బార్‌లలో డ్రింక్ సర్వ్‌చేసే అమ్మాయిలు ఒంటి పైభాగాన వస్త్రం వుండదు 'టాప్ లేస్' గా వుంటారన్న మాట. వీళ్ళనే 'బన్నీగర్ల్' అంటారు. యూరప్‌లో కొన్ని బార్‌లు కేవలం మహిళలకే పరిమితం. అక్కడ సర్వ్ చేసే యువకుల ఒంటిమీద ఒక జాకెట్ తప్ప మరేంవుండదు.

ఇంతకీ బొంబాయిలో 'బన్నీగర్ల్స్' వంటి పోఖేలు ప్రస్తుతం లేరు. మూతపడిన బార్‌లో మాత్రం అలాంటి వ్యవహారం నడిచేదట. మిగతా బార్‌లలో పనిచేసే అమ్మాయిలుగానీ, డ్యాన్స్ చేసే అమ్మాయిలుగానీ అలా శరీరాన్ని ప్రదర్శించరు. అయితే, తాగిన మైకంలో జనం మాత్రం వాళ్ళను నగ్నంగానూ, మరో విధంగా వూహించుకుంట్యూ వేరే లోకాల్లో తేలిపోతూ వుంటారు.

బొంబాయిలో మంచి బార్‌లకి వెళ్ళాలంటే సీట్లు ముందుగానే రిజర్వ్ చేసుకోవలసి వుంటుంది. మంచిస్థాయి కలిగిన డ్యాన్సర్లు, ఆరోగ్యంగా వుండే టాప్‌క్లాస్ బార్ మెయిడ్‌లు వుండే బార్‌లల్లో కూడా రద్దీ చాలా ఎక్కువగా వుంటుంది. కొన్ని బార్‌లలో ఎంట్రీ ఫీజు కూడా చెల్లించాలి. అందమైన అమ్మాయిలు సర్వ్ చేసే ఈ బార్‌లలోకి వెళ్ళటం అంటే భారీస్థాయిలో బిల్లులు చెల్లించడమేనని చెప్పకోవచ్చు.

**"బిల్లు ఇవ్వటానికి కౌంటర్ దగ్గరకి వెళ్ళినపుడు ఎదురుగా వున్న కంప్యూటర్‌లో నీ బొమ్మ రికార్డవుతుంది"**

మేం రాత్రి పదకొండు గంటల సమయంలో ఇలాంటి ఒక బార్‌కు వెళ్ళాం. అప్పటికే అక్కడి వాతావరణం పతాకస్థాయికి అత్యంత సమీపంలో ఉన్నట్టుగా వుంది. ఒక మూలన అన్నింటికన్నా ముందు మా కోసం ఒక టేబుల్ ఖాళీగా వుంది. మా టేబుల్‌కు కుడివైపున కౌంటర్ వుంది. కుడిచేతి వైపు మధ్యలో డ్యాన్సింగ్ ఫ్లోర్ వుంది. బార్‌లో కనీసం యాభై మంది కూర్చునే సౌకర్యం వుంది. కొన్ని టేబుళ్ళు నాలుగు కుర్చీలతో వుండగా మరికొన్ని రెండు కుర్చీలతో కూడిన చిన్నటేబుళ్ళు వున్నాయి. ప్రతి టేబుల్ దగ్గరా ఒక అందమైన అమ్మాయి వుంది. కొందరు అమ్మాయిలు కస్టమర్స్ యిచ్చే ఆర్డర్స్‌కోసం వేచి చూస్తున్నారు. కొందరు ట్రేలలో బీర్, ఇతర డ్రింక్స్ తీసుకువచ్చి సర్వ్ చేస్తున్నారు.

మేం నలుగురుం వున్నాం. మా టేబుల్ దగ్గర సర్వ్ చేస్తూన్న అమ్మాయి పెద్ద అందగత్తె ఏం కాదు. ఆమె శరీర సౌష్టవం కూడా చెప్పకోదగినంత విశేషమైంది కాదు. అయితే ఒకటి, మనిషి చాలా సౌమ్యంగా వుంది. ఆకుపచ్చని రంగులో వున్న సూట్ ధరించింది. సూట్ మీద పసువురంగులో వున్న ఎంబ్రాయిడరీ డిజైన్ మెరుస్తూ కనిపిస్తోంది. ముదురాకు పచ్చరంగులో వున్న పయ్యెద (దుపట్టా)ను మఫ్లర్ లాగా మెళ్ళో పొందికగా అమర్చింది.

నఖశిఖ పర్యంతం పరీక్షగా చూశాక ఆ అమ్మాయిలో ఒకే ఒక్క ప్రత్యేకత నిపసిగట్టాను – భారీ ఎత్తు వక్షస్థలం. బహుశా ఈ ప్రత్యేకత కారణంగానే ఆమెకు ఈ బార్ మెయిడ్ ఉద్యోగం దొరికి వుండి వుంటుందని అనిపించింది. నేను అటూ యిటూ దృష్టిని సారించాను. మిగతా టేబుళ్ళ దగ్గర సర్వ్ చేస్తున్న అమ్మాయిలలో ఎక్కువ మంది స్కర్టు, టాప్ లేదా లోకట్ ధరించి వున్నారు.

'చెహరా క్యా దేఖ్‌తే హో... దిల్ మే ఉతర్‌కర్ దేఖోనా...' (మొహాన్ని ఏం చూస్తూ కూర్చుంటావ్! గుండెలోతుల్లోకి తొంగి చూడరాదూ!) ఉన్నట్టుండి పెద్ద వాల్యూంలో పలికిన సినిమా పాట నా దృష్టిని మరల్చింది. అక్కడ డ్యాన్సింగ్ ఫ్లోర్‌లో పొడవాటి ఒక అందమైన అమ్మాయి ఈ పాటకు అనువుగా డ్యాన్స్ చేస్తోంది. 'దిల్ మే ఉతర్‌కర్ దేఖోనా' అని పాట పలికినప్పడల్లా మా టేబుల్ దగ్గర వున్న అమ్మాయి ఊపిరి బాగా పీల్చడంద్వారా తన వక్షస్థలాన్ని మరింత ప్రదర్శనా యోగ్యం చేస్తోంది. బహుశా ఈ బార్‌లలో 'దిల్' అంటే అర్థం అదేనేమో! డాన్స్‌లో కొద్దిపాటి రసికత ఉట్టి పడుతూందే తప్ప డ్యాన్సర్ మోతాదునకు మించి మాత్రం ప్రదర్శించడం లేదు. ఢిల్లీ కేబరే హౌస్‌లలో అధమస్థాయి అశ్లీలం వరదలై, వాగులై ప్రవహిస్తుంది. డ్యాన్సింగ్ ఫ్లోర్‌కు అటూ యిటూ సమీపంలో వున్న టేబుళ్ళ వద్ద కూర్చున్న కస్టమర్లు కుర్చీల్లోంచి లేచి డ్యాన్సర్‌కి అల్లంత దూరంలో డ్యాన్స్ చేయటం ప్రారంభించారు. డ్యాన్స్ చేస్తూన్న అమ్మాయి పసువు రంగు సూట్ ధరించి వుంది. నిడుపాటి కురులు ఆమె భుజాల మీద ఊగుతున్నాయి. డ్యాన్సింగ్ ఫ్లోర్‌కు అమర్చిన రంగు రంగుల విద్యుద్దీపాల కాంతిలో ఆ అమ్మాయి దుస్తులు ఇంద్రధనువులా రంగుల్ని చిందుతోంది.

ఇలాంటి బార్‌లలో డ్రింక్స్ సర్వ్ చేసే అమ్మాయిలను గురించి తెలునుకోవడం ప్రస్తుతం నా కర్తవ్యం. అందుకే నేను మధ్య మధ్యలో పరిసరాల్ని గమనిస్తూ కూర్చున్నాను:

మా వెనుక వున్న టేబుల్‌లో ఇద్దరు యువకులు వున్నారు. దాని పక్కనే కొద్ది దూరాన టేబుల్ వద్ద నలుగురు నడివయస్కులు కూర్చుని తాగుతున్నారు. కుర్రాళ్ళిద్దరూ తమకు డ్రింక్స్ సర్వ్ చేస్తున్న అమ్మాయిని తమతోపాటు సోఫా మీద కూర్చోబెట్టుకున్నారు. ఆమె పెగ్స్ కలుపుతూ సర్వ్ చేస్తోంది. కురచగా వున్న ఆ అమ్మాయి వయస్సు 18 లేక 19 సంవత్సరాలుంటుంది. బొద్దుగా కనిపిస్తుంది. పైన స్లీవ్‌లెస్ లోకట్ టాప్ వేసుకుంది. కింద మిడీ ధరించి వుంది. ఆమె గ్లాసులో డ్రింక్ పోసి, సోడా ఓపెన్ చేసి గ్లాసులో పోయడానికి వంగినపుడు లోకట్ లోంచి ఆమె ఉరోజాలు సగానికి పైగా కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ఆ టేబుల్ వద్ద వున్న కస్టమర్ల చూపులు అక్కడే తచ్చాడుతున్నాయి. అమ్మాయి ఆ విషయాన్ని గమనించి కూడా గమనించనట్లుగా వ్యవహరిస్తోంది.

ఒక కుర్రాడు ఆమెను కూడా ఒక పెగ్ తీసుకోమని అడిగాడు.

"సారీ సర్! మేం కస్టమర్లతో కూర్చుని తాగకూడదు" వినయంగా సమాధానం చెప్పింది ఆ అమ్మాయి.

"సరే! కనీసం సిగరెట్ అయినా కాల్చు" రెండో కుర్రాడు సిగరెట్ ఆమె కిచ్చాడు.

అమ్మాయి నవ్వుతూ సిగరెట్టు అందుకుని ఒక దమ్ములాగి పొగ వదులుతూ సిగరెట్టు తిరిగి అతని చేతికి అందించింది. 'ఎక్స్‌క్యూజ్‌మీ' అని చెప్పి అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

**మా వెనుక టేబుల్‌లో ఇద్దరు కుర్రాళ్లు డ్రింక్స్ సర్వ్ చేస్తున్న టీనేజ్ అమ్మాయిని తమతో బాటు సోఫాలో కూర్చోబెట్టుకున్నారు. ఆమె పెగ్స్ కలుపుతూ సర్వ్ చేస్తోంది.**

మా ముందున్న టేబిల్ వద్ద దృశ్యం మరోలా వుంది. టేబుల్ దగ్గర వున్న అమ్మాయి పొడుగ్గా వుంది. ఆ అమ్మాయి కూడా స్కర్టు వేసుకునే వుంది. ఆమె తన సన్నని నడుముతో ఎన్ని రకాల వయ్యారాలను ఒలకబోయవచ్చో అన్ని రకాల వయ్యారాలనూ ఒలకబోస్తూంది. ఆ టేబుల్ వద్ద కూర్చున్నవాళ్ళు బాగా తాగి వున్నారు. ఆ అమ్మాయి గ్లాసులోకి సోడా ఒంపుతున్నప్పడు వాళ్ళలో ఒక యువకుడు తన చేతిని ఆ అమ్మాయి స్కర్టులోనికి పోనిచ్చాడు.

'స్టుపిడ్' అని తిట్టేసి ఆ అమ్మాయి కోపంగా అక్కడి నుంచి కౌంటర్

దగ్గరికి వెళ్ళిపోయింది. కౌంటర్‌లో కూర్చున్న వ్యక్తికి ఫిర్యాదు చేసింది. కౌంటర్‌లో కూర్చున్న వ్యక్తి ఆ అమ్మాయి చెవిలో ఏదో గుసగుసలాడాడు.

ఆ అమ్మాయి తిరిగి ఆ టేబుల్ వద్దకు వచ్చేసింది. ఆ అమ్మాయి పెదవులు ఇవ్వడు చిరునగవులు చిందిస్తున్నాయి. ఆ అమ్మాయితో అస భ్యంగా ప్రవర్తించినవాడు పేరుమోసిన గూండా అయినా అయి వుండాలి లేదా ఎవరో పెద్దవాడి పుత్రరత్నమైనా అయి వుండాలి.

వెనకవేపు టేబుల్ వద్ద వున్న యువకుడు బేరర్‌ని పిలిచాడు. అతనికి ఒక చీటీ రాసిచ్చాడు. బేరర్ ఆ చీటీని తీసుకువెళ్లి కౌంటర్‌లో ఇచ్చాడు. కౌంటర్‌లో వున్న వ్యక్తి పది రూపాయిలు, అయిదు రూపాయిల నోట్లతో తయారుచేసిన దండ అతని చేతికి ఇచ్చాడు. బేరర్ ఆ దండ తీసుకుని వెళ్ళి డ్యాన్సర్ దండను ధరించి ఆ చిట్ పంపిన యువకుని కేసి తిరిగి తల వంచి నమస్కారాలు అర్పించింది.

డ్యాన్స్ పతాక స్థాయికి చేరుకుంటూండగా ఆ నడివయస్కుడు జేబు లోంచి చెక్‌బుక్ తీసి ఒక చెక్కు బేరర్ ద్వారా కౌంటర్ దగ్గరికి పంపాడు.

'అయిదు వేల రూపాయిలు!' కౌంటర్ క్లర్క్ అనౌన్స్ చేశాడు. అయిదు వేల రూపాయిల నోట్ల దండ అమ్మాయి మెడని అలంకరించింది. ఆ అమ్మాయి ఆ నడివయస్కుని కేసి చూసి కొంటెగా నవ్వుతూ 'ఫ్లయింగ్ కిస్' ఒకటి విసిరింది. మధ్యలో ఒక యువకుడు ఆ 'కిస్' అందుకోవటానికి ఎగిరినట్లు నటించాడు. ఒక్కసారిగా బార్ అంతా నవ్వులతో నిండిపోయింది.

ఒక బార్‌లో డ్యాన్సర్‌కి ఎవరూ అయిదు వేల రూపాయిలు బహుమా నంగా యివ్వలేదు. నోట్ల దండల వెనుక ఒక రహస్యం దాగి వున్నట్టు నాకు అనిపించింది.

'ఇది నైట్ బుకింగ్ పద్ధతి కాదుగదా?' నేను బొంబాయి మిత్రుణ్ణి అడిగాను.

'మీరు చాలా ఖచ్చితంగా పసిగట్టారు' చిర్నవ్వు నవ్వుతూ సమాధానం చెప్పాడు మిత్రుడు.

## పాత కాలంలో రాజులు, నవాబులు తమ మేడ మెట్లపై వరుసగా అమ్మాయిలను నగ్నంగా నిలబెట్టి ఆధారం కోసం వారి రొమ్ములను పట్టుకునేవాళ్ళట.


మా బిల్లు వచ్చేసింది. ప్రత్యేకమైన డిస్కౌంటు యిచ్చినప్పటికీ రూ. 375ల బిల్లు అయింది.

'బిల్లు ఇవ్వటానికి కౌంటర్ దగ్గరికి వెళ్ళినప్పుడు ఎదురుగా వున్న కంప్యూ టర్‌లో నీ బొమ్మ చిత్రించబడుతుంది' అని చెప్పాడు మిత్రుడు.

బార్ కెళ్ళిన ప్రతి మనిషి ఫోటోనూ వాళ్ళు దగ్గరుంచుకుంటారు. ఇదో పెద్ద రహస్యం!

నేను కౌంటర్ దగ్గరికి వెళ్ళినప్పుడు కౌంటర్ వెనుక టీవీ సెట్టులాంటి వస్తువు ఒకటి వుండడం గమనించాను. వాళ్ళ దృష్టిని పడకుండా గమనించ సాగాను. బిల్లు చెల్లించే వాళ్ళ ఫోటోలు కంప్యూటర్‌లో ఫీడ్ అవుతున్నాయి. బార్‌లోకి అడుగు పెట్టే ప్రతి కస్టమర్ మీదా వాళ్ళ నిఘా వుంటుంది. కస్టమర్ల రికార్డును బార్ యజమాన్లు మెయింటెయిన్ చేస్తుంటారు.

బొంబాయిలోని పెద్ద పెద్ద బార్లు మాఫియా ముఠాల ప్రభావం నుంచి యిప్పటికీ ఎప్పటికీ ముక్తిని సాధించలేవు. రెండోసారి బాంబు పేల్లుళ్ళ అనం తరం బొంబాయిలోని ప్రతి రంగంలోనూ అతి జాగ్రత్త అనేది వచ్చేసింది. అయితే యింతకీ ఈ బార్ యజమానులు కస్టమర్ల ఫోటోలను ఎందుకు నిక్షిప్తం చేస్తున్నారన్నది మాత్రం తేల్చి తీరవలసిన రహస్యమే.




అయిదింటికి పడుకుని రెండో రోజు పన్నెండు గంటలకు కరెంట్ పోవ డంతో నిద్రలేచాం. నిద్రలేచి పంపు దగ్గరికి వెళ్ళేప్పటికి అనుకోకుండా ఒక బార్ మెయిడ్ కలిసింది.

నిజానికి ఈ అమ్మాయి రెండు రోజుల క్రితం చర్చ్ గేట్ దగ్గర వున్న బార్‌లో మాకు డ్రింక్స్ సర్వ్ చేసింది. బార్‌లో కూడా ఈ అమ్మాయి గంభీరంగానే వుంది, ఎక్కువ సమయం. మధ్య మధ్యలో మహా అయితే కాస్తంత చిరునవ్వును చిలకరించేది అంతే. ఇతర బార్ మెయిడ్‌లకన్నా ఈ అమ్మాయి భిన్నంగా కనిపించింది. ఈమె వయస్సు 26 లేదా 27 సంవత్సరాలు వుంటుంది. బిగువైన శరీరం కావడంవల్ల అసలు వయస్సు కనిపించదు.

ఖచ్చితంగా మూడు గంటలకు బాత్ రూమ్ పక్కనే వున్న గది దగ్గరికి వెళ్ళి తలుపు తట్టాను.

'రండి... వచ్చేయండి' ఆమె లోపలి నుంచే పిలిచింది.

తలుపు తోసుకుని లోపలికి వెళ్ళాను. ఆ అమ్మాయి స్టౌ వెలిగించి టీ కాసుకుంటోంది. ఒక చిన్న మంచంగాక ఓ రెండు అడుగుల స్థలం మిగిలి వుంది. అక్షలు అదే స్టోర్ రూము. దాన్నే రూము కింద మార్చే శారు. గోడకు రెండు ఖానాలున్నాయి. ఓ మూలన చిన్న బల్లమీద స్టౌ వెలుగుతోంది. బ్రెడ్డు, ఫ్రిజ్ పాకెట్లు ఒక పక్కన వున్నాయి.

ఒక సూట్‌కేసూ, ప్లాస్టిక్ బాస్కెట్, బట్టలూ, కొన్ని వంట పాత్రలు – ఇవే ఆమె సామాన్లు.

మంచం మీద కూర్చోమని టీ తెచ్చి యిచ్చింది. ఆ అమ్మాయి మాటల సారాంశం ఇలా వుంది –

'నేను బరోడా (గుజరాత్) సమీపంలోని ఒక చిన్న టౌన్ నుంచి వచ్చాను. మాది ఒక మధ్యతరగతి కుటుంబం. పద్దెనిమిదేళ్ళ వయసులో నాకు పెళ్ళయింది. పంథొమ్మిదో ఏటకే ఒక బిడ్డకి తల్లినయ్యాను. చిన్నప్పటి నుంచీ నాకు నాటక రంగం మీదా, సినిమా రంగం మీదా చాలా మోజు వుండేది. నాటకాల్లో పనిచేసిన అనుభవం కూడా వుంది. పెళ్ళి అయ్యాక నాటకాలూ, సినిమాల గురించి పూర్తిగా మరిచి పోయాను. వున్నట్టుండి ఒక ఫ్రండు ప్రోద్బలంతో బొంబాయి సినిమా ఫీల్డులో మన అదృష్టం ఎలా ఫండుతుందో పరీక్షించుకుందామని వచ్చాను. ఒక బిడ్డకు తల్లినైనప్పటికీ నా శరీర సౌష్టవం ఎంతమాత్రం చెక్కు చెదరలేదు. నన్ను తీసుకు వచ్చే ముందు నా ఫ్రండు చేసిన వాగ్దానాలు కూడా అన్నీ యిన్నీ కాదు.

'నేను భర్త యిష్టాయిష్టాల్ని సయితం లెక్కచేయకుండా పిల్లాడ్ని మా

అమ్మదగ్గర వదిలిపెట్టి బొంబాయి వచ్చాను. బొంబాయిలో నాకు ఒక్క సినిమాలో కూడా అవకాశం దొరకలేదు. అయితే పతనం కావడానికి మాత్రం అవకాశాలు ఒకదాని వెంట ఒకటి పొంచి కూచున్నాయి. ఇష్టం వున్నా లేకపోయినా అవకాశాలు దొరుకుతాయన్న ఆశతోనూ, కలలు పండించుకోవాలన్న కాంక్షతోనూ తనువును తాకట్టుపెట్టాను. అయినా ఫలితంలేక ఆరు మాసాలకే తిరిగి ఇంటికి వెళ్ళిపోయాను. భర్తతో విభేదాలు వచ్చాయి. విభేదాలు విడాకుల దాకా వెళ్ళాయి. అదే సమయంలో మా నాన్న చనిపోయారు. అన్నయ్య వేరుగా కాపురం పెట్టుకున్నాడు. నా పద్ధతులు ఆయనకు సుతరమూ ఇష్టం లేదు. అమ్మా, నేనూ కలసి వుండసాగాం.

'నేను మరోసారి నా అదృష్టాన్ని పరీక్షించుకుందామని బొంబాయి వచ్చాను. కొన్ని సినిమాల్లో ఎక్స్ట్రా వేషాల్లాంటివి దొరికాయి, కానీ ఇక్కడ ఏ మార్గం కూడా నా శరీరం ద్వారా తప్ప తెరచుకునేట్టు కనపడలేదు. శరీరాన్ని ఉపయోగించుకోగలిగితే అన్ని మార్గాలూ బార్లా తెరుచుకుంటాయి.

'బార్ మెయిడ్ వృత్తిలోకి ఎప్పుడు వచ్చారు?' సంభాషణ తెగకుండా వుండేందుకు మధ్యలో ఒక ప్రశ్న వేశాను.

'మూడేళ్ళుగా ఈ పనిలో వున్నాను. అయితే ఈ ఉద్యోగం వరుసగా చేయను. కేవలం రెండు మూడు నెలలపాటువుండి వెళ్తుంటాను. సుమారు పదివేలు పోగయ్యాక మా వూరు వెళ్తాను. అవి నాలుగయిదు నెలలపాటు సరిపోతాయి. తిరిగి మళ్ళీ వస్తుంటాను.'

ఈమె ఉదయం తనలో వ్యభిచారం చేయనని స్పష్టంగా చెప్పింది. మరి రెండు మూడు నెలల వ్యవధిలో పదివేలు కూడబెట్టడం అసాధ్యం. 'బార్ మెయిడ్గానే మీరు అంత డబ్బును అంత తక్కువ వ్యవధిలో వెనకేయగలుగుతున్నారా?' సూటిగానే అడిగాను.

'నేను రెండు షిఫ్టుల్లో పని చేస్తాను. ఉదయం పూట ఒక రెస్టారెంట్లో పని చేస్తాను. సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయేవరకూ బార్లో పనిచేస్తాను. మీరు నన్ను చూశానని అంటున్నారు గదా... ఆ బార్లోనే...'

'ఈ బార్లో ఎప్పటి నుంచి చేస్తున్నారు?'

'ఒక నెల అయింది. మరో నెల రోజులపాటూ ఇక్కడే పని చేస్తాను'

'ఎప్పుడూ ఈ బార్లోనే పనిచేస్తుంటరా?'

'లేదు. బార్ యజమానులకు కూడా అది ఇష్టం వుండదు. మూడు నాలుగు నెలలకు మించి ఒకే అమ్మాయి ఒకే బార్లో వుండటంకన్నా మారుతూ వుండటంవల్ల కస్టమర్స్ ఆకర్షణ కొనసాగుతూవుంటుందని వారు భావిస్తారు. అంతేకాక బార్ మెయిడ్లలో సగం మందికి పైగా ఈ వృత్తిని రహస్యంగా చేస్తుంటారు. ఇది చాలా అవమానకరమైన వృత్తి కదా!'

'సరే, మీరు మీ ఇంట్లో ఏమని చెప్పి వస్తారు?'

'నేను ఆర్టిస్టుని కదా. మా వూరి వాళ్ళు నేను సినిమాలు, సీరియల్స్లలో పని చేస్తూ వుంటానని భావిస్తారు. నా పరిస్థితి గురించి మా అమ్మకే ఎంతో కొంత ఎక్కువగా తెలుసు. కానీ ఆమె మాత్రం చేయగలిగింది ఏముంది! ఇపుడు నా కొడుకు వయస్సు ఆరు సంవత్సరాలు. స్కూలుకు వెళుతున్నాడు. ఇంకా రెండు మూడేళ్ళు యిలా గడిపేయవచ్చు. ఆ తరువాత పిల్లవాడు పెద్దయితే యిక యిది సాధ్యం కాదు...' ఆమె ఒక పెద్ద నిట్టూర్పు విడిచింది. 'నాకు ఈ రోజు ఒక డ్యూటీ ఆఫ్. అయితే బార్కు మాత్రం వెళ్ళాలి. నేను ఇక తయారవ్వాలి' అని నవ్వుతూ నాకేసి చూసింది.

నేను బయటికి వెళ్ళిపోవటానికి లేచాను.

'అక్కర్లే మీరు వెళ్ళిపోనవసరం లేదు. నేను బట్టలు మార్చుకోనవసరం లేదు. మీరు మరో పది నిముషాలపాటు కూర్చోవచ్చు' అంది.

ఆమె నాతో మాట్లాడుతూనే తన పనులు చక్కబెట్టుకుంటోంది. స్కర్టు, టాప్, బ్రా లోపల పెట్టుకునే ప్యాడ్లు బ్యాగులో పెట్టుకుంది. తన వుంటున్న గదికి రోజుకు 40 రూపాయిల చొప్పున చెల్లిస్తానని చెప్పింది. లాడ్జి యజమాని చాలా మంచి వ్యక్తి అనీ, తన పట్ల ఎంతో దయగలిగి వుంటాడనీ అంది.

ప్రస్తుతం ఆమె చీరె కట్టుకుని వుంది. మేకప్ బాక్స్ నుంచి కాటుక తీసి తన పెద్ద పెద్ద కళ్ళను మరింత అందంగా కనిపించేట్టు తీర్చి దిద్దసాగింది. ఆ తరువాత ఎడం కాలు మంచం పట్టెమీద పెట్టి పిక్కల్ని పాన్ కేక్తో అలంకరించసాగింది. ఆమె మోకాలి చిప్ప కింద ఒక మచ్చ వుంది. అది కనిపించకుండా వుండేందుకుగాను ఆమె మేకప్ చేస్తోంది.

'ఏమైనా దెబ్బ తగిలిందా?'

'లేదు. ఒక రాక్షసుడు సిగరెట్టుతో కాల్చాడు.'

'ఎలా?'

'రెండేళ్ళ క్రితం నేను వేరే ఒక బార్లో పనిచేసే దాన్ని. నేను ఒక టేబుల్ దగ్గర సర్వ్ చేస్తున్నాను. నేను బార్ మెయిడ్గా పని చేస్తున్న మాట నిజమే గాని అట్లా అని చెప్పి కస్టమర్ కౌగిట్లోకి, వాడి పడక మీదికి వెళ్ళే పని నేను చేయను. ఒకడు నన్ను కంపెనీ యివ్వమని యిబ్బంది పెట్టసాగాడు. నేను ఒప్పుకోలేదు. వాడు తాగిన మైకంలో కాలుతూన్న సిగరెట్టును నా పిక్కల మీద నలిపాడు.'

'తర్వాత ఏమైంది?'

'ఏమవుతుంది? నేను యజమానికి ఫిర్యాదు చేశాను. వాడు ఆ ప్రాంతంలోనే పేరు మోసిన దుర్మార్గుడు. కాబట్టి కొన్నాళ్ళపాటు వేరే ఎక్కడయినా పనిచేసుకోమని యజమాని నాకు సలహా యిచ్చాడు.'

'సరే, నాకు ఓ విషయం మాత్రం నిజాయితీగా చెప్పాలి. బార్ మెయిడ్ వృత్తిలో వున్న అమ్మాయిలంతా దేహ వ్యాపార విషచక్రంలో ఇరుక్కున్నవారేనా?'

'మొత్తం కుట్ర అంతా ఈ విషయంలోనే వుంది. అయితే, అది ప్రధానంగా ఒక్కో అమ్మాయి ఆత్మస్థయిర్యం మీద ఆధారపడి వుంటుంది. ఈ విషచక్రం నుంచి తప్పించుకోవడం అనేది మరీ అంత తేలికైన పని కూడా కాదు. అలాగే ఎవరైనా ఒక అమ్మాయికి ఖచ్చితంగా యిష్టం లేని పక్షంలో ఎవరూ ఆమెను వంచలేరు.'

'డబ్బు కూడానా?'

'అందరూ అలాగే అనుకుంటారు – డబ్బుతో ఏమైనా సాధించగలమని. కానీ అది పూర్తి నిజం మాత్రం కాదు. మనిషి ద్వారా కాలం, పరిస్థితులు అన్నీ చేయిస్తాయి. కేవలం డబ్బు మాత్రం కాదు'

ఆమె వెళ్ళిపోవటానికి సంసిద్ధమైంది. నేను థ్యాంక్స్ చెప్పి బయటికి వచ్చేశాను.

ఆధునిక వ్యాపార ప్రపంచం ఇండస్ట్రియల్ రివల్యూషన్ తాలూకు విష పరిణామాలకు బలయిపోతున్న యువతుల పట్ల ఆవేదనతో హృదయం అంతా నింపుకుని.

